క్లుప్తంగా

పరీక్షా కేంద్రాల్లో వసతుల కల్పనపై దృష్టి పెట్టండి

ఆర్డీవో హెలా షారోన్



రేపల్లె రూరల్: పదో తరగతి పరీక్షలు పట్టణంలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్షను విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో రాశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆర్డీవో హెలా షారోన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందని కేంద్రాల సమీపంలో గుంపులుగా ఎవరైనా ఉంటే వారిపై చర్య తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

చావలి(వేమూరు): పురుగుల మందు తాగి సోమరౌతు వెంకయ్య(60) అనే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వేమూరు మండలంలోని చావలి గ్రామానికి చెందిన సోమరౌతు వెంకయ్య ఆదివారం ఉదయం ఇంటి వద్ద పురుగుల మందు సేవించాడు. భార్య చూసి ఇంటి పక్క వారికి చెప్పడంతో ఇరుగు పొరుగు వారు వచ్చి 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యసేవలు అందిస్తున్న క్రమంలో సాయంత్రం 6 గంటలకు మృతి చెందినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కట్టుదిట్టంగా ఎన్నికల కోడ్ అమలు



వేమూరు: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఈ నెల 16న ఎన్నికల కమిషన్ కోడ్ ప్రకటించడంతో ఎన్నికల కోడ్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయడం జరుగుతుందని ఎంపీడీవో జీఎస్‌పీ శేషగిరిరావు తెలిపారు. సోమవారం వేమూరు మండల కేంద్రంలోని వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, జెండా దిమ్మలపై ఉన్న జెండాలు, పార్టీ తోరణాలను తొలగించడంతో పాటు వివిధ రాజకీయ నాయకుల విగ్రహాలపై ముసుగు వేయడం జరిగిందని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఎన్నికల నియమావళిని పాటించడం జరుగుతుందన్నారు.

వాహనాలు తనిఖీ



కాకుమాను: ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాలలో ఎవరైనా అనుమతులు లేకుండా నగదు, మద్యం తరలిస్తే అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ రవీంద్ర అన్నారు. మండలంలోని కొమ్మూరు శివారులో సోమవారం రాత్రి ఆయన తన సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా ఎవరైన ఓటర్లను నగదు, మద్యం బాటిళ్లు ఇచ్చి ఆకర్షించే విధంగా ఎలాంటి చర్యలు చేపట్టినా అటువంటి వారిని గుర్తించి, వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

భట్టిప్రోలు తిరునాళ్లకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 24న కల్యాణ మల్లేశ్వరుని రథోత్సవం
- లక్ష మంది భక్తులు వీక్షిస్తారని అంచనా



భట్టిప్రోలులోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవాలయం



శ్రీ మల్లేశ్వర స్వామివారు



రథోత్సవానికి సిద్ధమైన రథం

భట్టిప్రోలు: చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలే భట్టిప్రోలు తిరునాళ్లగా ప్రసిద్ధి గాంచాయి. ఈ నెల 24న ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి నాడు జరిగే రథోత్సవం కనుల పండువగా సాగనుంది. అతి ప్రాచీన దేవాలయాల్లో ఈ ఆలయం ప్రముఖమైనది. ఈ నెల 5న స్వామి వారి కల్యాణం జరుగుతుంది. పౌర్ణమి రోజు జరిగే రథోత్సవానికి ఇక్కడి ప్రజలు అధిక ప్రాముఖ్యతను ఇస్తారు.

భట్టిప్రోలు నడిబొడ్డున స్వామి వారి దేవాలయం 1689లో అద్దేపల్లి-భట్టిప్రోలు పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో నిర్మితమైంది. అప్పటి నుంచి ప్రతి ఏటా కార్తీక మాస పూజలు, దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు, శ్రీవారి బ్రహ్మోత్సవాలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల నిమిత్తం 1910లో ఒక రథాన్ని నిర్మించారు. అది 1913లో దీపావళి పర్వదినాన నిప్పు రవ్వలు పడి పూర్తిగా దగ్ధమైపోయింది. ఆ తరువాత మూడేళ్ల పాటు రథోత్సవానికి అంతరాయం కలిగింది. 1916లో నూతన రథం నిర్మాణం జరిగినప్పటి నుంచి ఏటా రథోత్సవం జరుగుతూనే ఉంది. రాష్ట్రంలోని పెద్ద రథాలలో భట్టిప్రోలు రథం ఒకటి. ఈ రథం ఎత్తు 36 అడుగులు కాగా 45 అడుగుల చుట్టు కొలత, 19 అంగుళాల మందం కలిగిన నాలుగు చక్రాలు 6 అడుగుల ఎత్తులో ఉంటాయి. ఎనిమిదిన్నర అంగుళాల ఇరుసుతో ఒక్కో చక్రం 26 అడుగుల వ్యాసార్థం కలిగి ఉంది. ఈ రథాన్ని కృష్ణా జిల్లా గుడివాడకు సమీపంలోని పెదపారపూడికి చెందిన విశ్వబ్రాహ్మణుడు పడపా వీరభద్రుడు ఎంతో దైవ భక్తితో మలిచాడని పెద్దలు చెబుతారు. రథం ఇరుసు వరకు చెక్కిన శృంగార శిల్ప భంగిమలు చూపరులను ఇట్టే ఆకర్షిస్తాయి. రథంపైన గల ద్వారపాలకులను శిరిపురం వెంకట సుబ్బయ్య (తిరుపతి) రూపకల్పన చేశారు. ఈ దేవాలయానికి నిత్య ధూప, దీప నైవేద్యాల నిమిత్తం 1689లో అప్పటి రాచూరు జమిందార్ వెంకటాద్రి నాయుడు 12 ఎకరాల భూమిని దేవుని మాన్యం కింద ఇచ్చారు.

మత సామరస్యానికి ప్రతీకగా రథోత్సవం

స్వామివారి రథోత్సవానికి ఇక్కడి ప్రజలు అధిక ప్రాముఖ్యత ఇస్తారు. రథోత్సవంలో పాల్గొనడానికి భక్తులు, బంధువులు వివిధ ప్రాంతాల నుంచి తండోప తండాలుగా విచ్చేస్తారు. రథాన్ని నైపుణ్యం కలిగిన చొప్పాదారులు, భక్తులు స్థానిక దేవాలయం వద్ద నుంచి అద్దేపల్లి అమ్మవారి చెట్టు వద్ద వరకు లాగుతారు. భారీ ఎత్తున జరిగే ఈ రథోత్సవ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన దాఖలాలు లేవు. పోలీస్ బందోబస్తు, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో భక్తులు ఈ రథాన్ని లాగుతారు. పిన్నలు, పెద్దలు, అన్ని మతాల వారు ఈ రథోత్సవంలో పాలు పంచుకోవడం విశేషం. రథయాత్ర పూర్తి కావడానికి సుమారు 4 గంటల సమయం పడుతుంది.

రథంపై కల్యాణ మల్లేశ్వరుడు జరుపుకునే ఊరేగింపు లక్ష మంది తిలకిస్తారు. స్వామివారి ఆలయంలో ఉన్న ఇత్తడి పులి వాహనాన్ని ఉయ్యూరు, వల్లూరు, గుడివాడలకు చెందిన పద్మశాలీయ బహుత్తమ సంఘీయులు తయారు చేయించారు. దేవాలయంలోని రాతి ముఖ మండపాన్ని 1925లో భట్టిప్రోలుకు చెందిన కుమ్మరిగుంట తిరువేంగళం, వెంకటరెడ్డిలు నిర్మించారు. అనాదిగా వంశపారంపర్యంగా ధర్మకర్తల మేనేజ్‌మెంట్ కింద ఉన్న ఈ దేవాలయాన్ని 1993 ఏప్రిల్ నుంచి దేవదాయ శాఖ కిందకు మార్పు చేస్తూ కార్యనిర్వహణాధికారిని ప్రభుత్వం నియమించింది. స్వామివారి బహ్మోత్సవాలలో భాగంగా ధ్వజారోహణ, అభిషేకాలు, బిందె తీర్థాలు, పుష్పసేవ, పొన్నమాను ఉత్సవం, జగజ్యోతి, ఎదురుకోల మహోత్సవం, సహస్ర దీపోత్సవం, స్వామివారి కల్యాణం, వసంతోత్సవం, ఉపన్యాసాలు, కళాకారుల భజన కార్యక్రమాలు, నాటకాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం ఉత్సవ నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్న దేవాలయ కార్యనిర్వాహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ దేవాలయాన్ని వైభవోపేతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారు.

21 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



రేపల్లె రూరల్: రేపల్లె పట్టణం ఉప్పూడి రోడ్డులో వేంచేసి యున్న శ్రీ లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ సింగిల్ ట్రస్టీ గడ్డం రాధాకృష్ణమూర్తి సోమవారం తెలిపారు. 21న గురువారం స్వామి వారిని పెండ్లి కుమారుడిని చేయటం, గజవాహన సేవ, 22న హనుమద్వాహన, శేష వాహన సేవ, 23న శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం, అన్నసంతర్పణ, గరుడ వాహన సేవ, 24న మహాశాంతి హోమం, రథోత్సవం, 25న మహా పూర్ణాహుతి, పవళింపు సేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రేపు మెగా జాబ్ మేళా

పొన్నూరు: ఈ నెల 20వ తేదీన నిడుబ్రోలులోని పీబీఎన్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల అధ్యక్షుడు ఎస్.అంకప్ప చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో జాబ్‌మేళాకు సంబంధించిన బ్రోచర్‌ను అంకప్పచౌదరి ఆవిష్కరించారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే జాబ్‌మేళాలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, బీఎస్సీ, బీకాం, బీసీఏ ఉత్తీర్ణులైన విద్యార్థులు పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శివకుమారి, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ కె.శ్రీనివాసరావు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



కోన రఘుపతి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

కర్లపాలెం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని బాపట్ల నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి కోరారు. వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, వార్డు మెంబర్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో కర్లపాలెంకు చెందిన టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు సోమవారం కోన రఘుపతి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి రఘుపతి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వ్యక్తులు మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. కోన రఘుపతి విజయం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీటీసీ ఆసిఫ్ అలీ, కోఆప్షన్ సభ్యుడు అమీర్‌బేగ్, నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, నాగరాజు, నాగరాజురెడ్డి, ఇమ్రాన్, అజీంఖాన్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు



బీఎల్ఓలకు సూచనలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓలు

కొల్లూరు : ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఓటరు జాబితాలలో చేర్పులు, మార్పుల విషయంలో బూత్ లెవెల్ అధికారులు విచారణ పారదర్శకంగా చేపట్టి నివేదికలు సమగ్రంగా సమర్పించాలని కొల్లూరు తహసీల్దార్ పుల్లారావు సూచించారు. సోమవారం కొల్లూరు మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఎల్ఓలు తాము చేపట్టిన విచారణ అనంతరం సిద్ధం చేసే నివేదికల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించడంతో పాటు ఓటర్ల జాబితాలో మార్పుల కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తుల సమగ్ర సమాచారాన్ని సేకరించాలన్నారు. ఆ గృహాల పక్కన నివసించే వ్యక్తుల వాంగ్మూలాన్ని సైతం స్వీకరించాలని సూచించారు. అనంతరం వేమూరు నియోజకవర్గ ఆర్ఓ వసంతరాయుడ్ని సిబ్బంది ఎన్నికల నిబంధనల అమలుపై పలు అనుమానాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదుల సెల్

ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ పి. శ్రీకర్



24/7 ఫిర్యాదుల సెల్‌లో పనిచేస్తున్న సిబ్బంది

ప్రత్తిపాడు: పారదర్శకంగా నిష్పాక్షికంగా ఎన్నికలను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమయ్యింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలతో పాటు ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఫిర్యాదు చేసేందుకు నియోజకవర్గ స్థాయిలో ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదుల సెల్/ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.శ్రీకర్ తెలిపారు. 24/7 సెల్ పనిచేసేలా సిబ్బందికి విధులు కేటాయించడం జరిగిందన్నారు. ఈ సెంటర్ ద్వారా ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు, విషయాలు స్వీకరించడంతో పాటు సి-విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను పర్యవేక్షించడం, సంబంధిత అధికారులను సమయన్వయం చేయడం వంటివి ఉంటాయన్నారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు ఫిర్యాదుల సెల్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఓటర్లు, ప్రజలు 0863-2940262 నంబరుకు కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు. ప్రత్తిపాడు, పెదనందిపాడు, గుంటూరు రూరల్, వట్టి చెరుకూరు, కాకుమాను మండలాల ప్రజలు అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్వో కోరారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

గుంటూరు రూరల్: ప్రతి ఓటరు, తమ ఓటు హక్కును వినియోగించుకొనేవిధంగా, వారిలో చైతన్యం నింపడంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాల విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో ఆంధ్ర రాష్ట్ర ఎన్ఎస్ఎస్ విభాగం ఆదేశాల మేరకు ప్రజల్లో ఓటు అవగాహన కల్పించడం జరిగింది. సమీప గ్రామాల్లో బ్యానర్లు ప్లకార్డులతో ప్రజలకు ఓటు హక్కును గురించి అవగాహన కల్పించారు. ఓటు హక్కును వినియోగించుకుని తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకోవచ్చని తెలిపారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతిపౌరుని బాధ్యతని, దేశ ప్రగతికి ఓటు కీలక ఆధారమని కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. ఏడు రోజుల పాటు ఓటు అవగాహనపై, ఎంపిక చేసిన కొన్ని గ్రామాల్లో స్పెషల్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు, ఓబులనాయుడుపాలెం, పొత్తూరు గ్రామాలలో పర్యటించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు.

ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం

పట్నంబజారు: కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి వైఎస్సార్ సీపీలో సముచిత స్థానం దక్కుతుందని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఎస్.అవినాష్ సోమవారం కాకానిలోని ఎంపీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో యువజన విభాగం ఎంతో కీలకంగా వ్యవహరించాలని కోరారు.

ఎన్నికల నిబంధనలకు టీడీపీ తూట్లు



కొల్లూరు టీడీపీ కార్యాలయం వద్ద ప్రదర్శనగా ఉంచిన సైకిల్



బస్టాండ్ సెంటర్‌లో ఓ దుకాణ భవనంపై దర్శనమిస్తున్న టీడీపీ అభ్యర్థికి చెందిన హోర్డింగ్

- పలుచోట్ల దర్శనమిస్తున్న పార్టీ హోర్డింగులు
- టీడీపీ కార్యాలయం వద్ద ప్రదర్శనగా ఉంచిన సైకిల్

కొల్లూరు : ఎన్నికల నిబంధనలకు ప్రతిపక్ష టీడీపీ తూట్లు పొడుస్తోంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికీ నిబంధనలను బేఖాతరు చేస్తూ తమ పార్టీకి చెందిన ఎన్నికల గుర్తు చిహ్నాన్ని, తమ పార్టీ అభ్యర్థికి సంబంధించిన హోర్డింగ్‌లను ప్రదర్శనగా ఉంచి ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ప్రవర్తించడం విమర్శలకు తావిస్తోంది. కొల్లూరు వీధుల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, హోర్డింగ్‌లను పంచాయతీ యంత్రాంగం తొలగిస్తున్నప్పటికీ టీడీపీ నాయకులు మాత్రం తమ పార్టీకి చెందిన హోర్డింగ్‌లు తొలగింప జేయకపోవడం విమర్శలకు బలాన్ని చేకూరుస్తుంది. కొల్లూరు బస్టాండ్ సెంటర్లోని ఓ దుకాణ భవనంపై ఏర్పాటు చేసిన హోర్డింగ్‌ని ఆదివారం పంచాయతీ యంత్రాంగం తొలగించినప్పటికీ తిరిగి వెంటనే ఏర్పాటు చేసి టీడీపీ నాయకులు ఎన్నికల నిబంధనలకు తిలోధకాలిచ్చారు. కొల్లూరు బాలికోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయం వద్ద సైతం బహిరంగ ప్రదేశంలో ఆ పార్టీకి చెందిన సైకిల్ గుర్తుకు చిహ్నంగా పసుపు రంగు వేసిన సైకిల్‌ను తొలగించకపోవడం, అనుమతులు లేకుండా ఆ పార్టీ కార్యాలయం వెలుపల టీడీపీకి చెందిన నాయకులు, చిహ్నాలను ఏర్పాటు చేసి ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడ్డారు.

నిబంధనల అమలుపై అధికారుల భిన్న ఆదేశాలు

ఎన్నికల నిబంధనలు అమలుపై అధికారులు భిన్న ఆదేశాలతో క్షేత్ర స్థాయి అధికారుల్లో సందిగ్ధత నెలకొంది. సొంత ప్రదేశాల్లో రాజకీయ పార్టీల హోర్డింగ్‌లు, ఫ్లెక్సీల తొలగింపు విషయంపై సిబ్బంది ఆర్ఓ వసంతరాయుడు వద్ద అనుమానాలను వెల్లడించగా సొంత స్థలాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల విషయంలో పట్టించుకోనవసరం లేదని బదులిచ్చారు. బహిరంగ ప్రాంతాల్లోని ఉన్న వాటిని తొలగించాలని ఆదేశించారు. ఇదే విషయంపై ఎన్నికల డీటీ శ్రీనివాసులు మాత్రం రాజకీయ పార్టీలు అనుమతులు లేకుండా సొంత భవనాల పైన సైతం ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఉంచరాదని వివరణ ఇచ్చారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

నగరంపాలెం: భర్త ఆచూకీ తెలియరాలేదంటూ భార్య పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టాభిపురం పెట్రోల్ బంక్ సమీపాన ఉంటున్న వి.హనుమంతురావు వ్యాపారం చేసేవారు. ఈ నెల మూడో తేదీన హైదరాబాద్ వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయలు దేరారు. అయితే అప్పటి నుంచి భర్త ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉందని, తెలిసిన వారి వద్ద విచారించిన ఆచూకీ తెలియలేదని భార్య సుధారాణి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కోడ్ ఉల్లంఘనలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రత్తిపాడు: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు ఎంపీడీఓ, ఎంసీసీ అధికారి కె.దుర్గాప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని ఈదులపాలెం, నడింపాలెం, తుమ్మలపాలెం గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, రాజకీయ నాయకుల బొమ్మలు పబ్లిక్ ప్రైవేట్ ప్రదేశాల్లో ఉన్నాయా? ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ బోర్డులు, పోస్టర్లు ఏమైనా ఉన్నాయా అన్న విషయాలను పరిశీలించారు. అనంతరం ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో కోడ్ పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరిగినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. సమావేశంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలింగ్‌స్టేషన్లలో మౌలిక సదుపాయాలు



ప్రత్తిపాడు: పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.పద్మజ అన్నారు. ప్రత్తిపాడు మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెం, బొర్రావారిపాలెం, పాతమల్లాయపాలెం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను సోమవారం తహసీల్దార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వెలుపల ర్యాంప్‌లు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, కేంద్రం లోపల విద్యుత్, లైటింగ్..వంటి సౌకర్యాలు ఉన్నాయా లేవా అన్న విషయాలను పరిశీలించారు. చేపట్టవలసిన చర్యలను వీఆర్వోలు, వీఎల్‌వోలకు సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పద్మజ మాట్లాడుతూ ఓటర్లు ప్రశాంతంగా ఎలాంటి ఇబ్బందులూ పడకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తీసుకోవలసిన అన్ని రకాల చర్యలను పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకుంటున్నామని చెప్పారు. వెంట బీఎల్‌ఓలు, వీఆర్వోలు ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్ల వద్దకే సంక్షేమం

- పొన్నూరు గడ్డపై మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దాం
- ప్రతిపక్షాల మోసపూరిత మాటలు నమ్మవద్దు
- వైఎస్సార్ సీపీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- ములుకుదురులో ఇంటింటి ప్రచారం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో పొన్నూరు నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసేలా కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ములుకుదురు గ్రామంలో ఆయన పర్యటించారు. సేవా కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజలతో మమేకమైన అంబటి మురళీకృష్ణకు గ్రామ ప్రజలు ఘనస్వాగతం పలికారు. గ్రామంలో ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరించి, సమస్యలు తెలుసుకున్నారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ టీడీపీ పాలనలో ఏదైనా సంక్షేమ పథకం ద్వారా లబ్ధి చేకూరాలంటే జన్మభూమి కమిటీల సిఫారసుతో పాటు, నాయకుల అండదండలు అవసరమయ్యేవని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, రాజకీయాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. పథకాల లబ్ధిలో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుని మరింత సంక్షేమాభివృద్ధి సాధిద్దామన్నారు. అధికారం కోసం టీడీపీ జనసేన చేస్తున్న అసత్యాలు, మోసపూరిత మాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు కర్లపూడి రమేష్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్, నాయకులు షేక్ నాజర్, ఆకుల వెంకటేశ్వరరావు, దాసరి శివరామకృష్ణ, దేవరకొండ గోపి, గ్రామస్తులు పాల్గొన్నారు.